**ప్రకటన**

# ఉ..సాంబశివరావు మృతి కి సంతాపం

**ఉ.సా.గా** చిరపరిచితుడయిన ఉప్పుమావులూరి సాంబశివరావు జూలై 25వ తేదీన మరణించారన్న వార్త తెలిసింది. కరోనా వ్యాధితో ఉ.సా మరణించడం చాలా విచారకరం.

ఉ.సా పుట్టింది గుంటూరు జిల్లాలోని బ్రాహ్మణ కోడూరు. ఈ గ్రామాలు ఒకప్పుడు జాతీయోద్యమంలో సాంఘిక చైతన్యంలో పురోగామి పాత్ర నిర్వహించాయి. 1947 తర్వాత పాలకవర్గాలు జాతీయోద్యమానికి ద్రోహం చేసిన ఫలితంగా అవి తిరోగమన క్రమంలో ఉండగా ఉ.సా విద్యార్థి దశ సాగింది. హేతువాదిగా తెనాలి లోని గిరజాల సీతారామయ్యగారి నవీనా హొటల్లో రాత్రి క్యాషియర్గా పనిచేస్తూ తెనాలి వి.ఎస్.ఆర్ కాలేజీలో బి.ఎస్.సి పూర్తి చేశాడు.

అప్పటికే కవితలు రాసేవాడు. వివక్షతతో పాటు దాని కన్నా పేదరికం తెచ్చిపెట్టే ఆత్మన్యూనతను అధిగమించే పోరాటం సృజనాత్మకతకు పదును పెట్టటం అన్నది విప్లవ రాజకీయాల స్వీకారంతో సాధ్యమైంది. నాడు తెనాలిలో అప్పట్లో విరసంగా ఉండే జుగాష్విలి ద్వారా జైళ్ల నుంచి విడుదల అయిన సింహాద్రి సుబ్బారెడ్డి,కమ్మెల భాస్కరరావుల పరిచయంతో విప్లవ రాజకీయాలలోకి ఉ.సా ప్రవేశించాడు. 1974లో తెనాలిలో ఏర్పడిన అరుణోదయ సాహితీ సాంస్కృతిక సంస్థకి కన్వీనర్గా ఎమర్జెన్సీ ప్రకటించే వరకూ పనిచేసాడు. 'అరుణోదయ' చర్చావేదికలూ, పేటలలో రాత్రి పాఠశాలలు, గ్రామాలలో సాంస్కృతిక ప్రదర్శనల వంటి వాటి ద్వారా శ్రమజీవులలోకి వెళ్ళడానికి, మార్క్సిజంపై ప్రాథమిక విశ్వాసం ఏర్పరుచుకోవడానికి ఈ కృషి నాటి కార్యకర్తలకు ఉపయోగపడింది.

ఎమెర్జన్సీలో ఉ.సా పూర్తికాలపు విప్లవ కారుడుగా పనిచేయాలని నిర్ణయించుకొన్నాడు. ఈ క్రమంలో తూర్పుగోదావరి జిల్లా ద్వారపూడిలో అరెస్టు అయ్యాడు. ఎమర్జెన్సీ తరువాత వివిధ బాధ్యతలు నిర్వహిస్తూనే కవిగా అజరామరమైన పాటలు రాసాడు. "జోలాలి పాడాలి" అనే పాట, పోలీసు నిర్భంధం గురించి "మేమెందుకిలా మారామో తెలుసా" అనేది, నాడు బ్యాంకు అప్పు వసూళ్ళ పేరుతో రైతులపై సాగుతున్న వేధింపులపై "అప్పులు మేం తీర్చలేం ఆందోళన సాగిస్తాం" అనే పాట రాసాడు. ఇవేగాక జనసాహితీ ప్రారంభ గీతాలుగా స్వీకరించిన "మేం పాడుతాం జనం పాట పాడుతాం "కవీ ఓ కళాకారుడా కవయిత్రీ ఓ కళాకారిణి" వంటి పాటలు ఉ.సా రచించినవే.

ఈ సందర్భంగా ఉ.సా వివాహం పార్టీ నాయకత్వం సూచించిన కామ్రేడ్ పద్మతో వారిరువురి అంగీకారంతో జరిగింది. ఉ.సా.తో పాటు పార్టీలో ఉన్నత స్థాయికి ఎదగాలని నాయకత్వం కోరుకొంటున్న మరో ముగ్గురు కామ్రేడ్లకూ వివాహ ప్రతిపాదనలను నాయకత్వం తెచ్చింది. వాటిని వారంతా ఆమోదించటంతో ఇంచుమించు ఒకే సమయంలో వీరందరి వివాహాలు జరిగాయి. ఏ పార్టీ మీదైతే తర్వాత అగ్రకుల ముద్ర వేయడానికి దుష్ప్రచారం సాగిందో, ఆ పార్టీ నాయకత్వం వీరందరి జీవిత భాగస్వాములుగా ప్రతిపాదించబడిన మహిళా కామ్రేడ్లు అందరూ బయటి సమాజం దృష్టిలో "ఉన్నత" కులాలకు చెందినవారే. బయట సమాజం గుర్తించే సాంఘిక అంతస్తు దృక్కోణం నుంచి చూస్తే ఈ వివాహాలకు ప్రతిపాదించబడిన పురుష కామ్రేడ్లు కంటే మహిళా కామ్రేడ్లు "ఉన్నత కులాలకు" చెందినవారు. నిజానికి నాయకత్వం కుల ప్రాతిపదికన ఈ పెళ్ళిళ్ళు చేయలేదు. వీరందరూ విప్లవ కార్యాచరణలో మరింత పురోగమించాలని ఆశించి ఈ వివాహాలు జరిపింది.

ఈ క్రమంలో పార్టీ సాగించిన నిర్దిష్ట నిర్మాణ కృషి ద్వారా కొండమొదలు ప్రాంతంలోని గిరిజనోద్యమం యొక్క భూపోరాటం ప్రతిఘటనా స్థాయికి చేరింది. ఆ సమయంలో కొండమొదలులో 1982 నవంబరు చివర్లో ఒక బహిరంగ సభను నిర్వహించాలనుకొని ఏర్పాట్లు జరిగాయి. వీటి కోసం అమరుడు కామ్రేడ్ మానం రామారావుగారు, ఉ.సా. మరియూ సాంస్కృతిక బృంద కామ్రేడ్లు కొండమొదలు వచ్చారు. వీరు చేరే సమయానికే పోలీసు కాల్పులు జరిగిపోయి కామ్రేడ్లు కుంజం రాజులూ మడెం లక్ష్మయ్యలు వీరోచితంగా పోరాడుతూ మరణించారు. ఆ సమయంలో పోలీసు దౌర్జన్యాలకు వ్యతిరేకంగా మైదాన ప్రాంతంలో రాజకీయ ప్రచారం, లీగల్ ఆందోళనలను మానం రామారావుగారు శక్తివంతంగా సాగించారు. కొండమొదలులో మొదటినుండీ ఆ ఉద్యమాన్ని అంటిపెట్టుకొని ఉన్న అమరుడు కామ్రేడ్ నక్కా మోషే(సోమయ్య) గారికి, ఇతర కార్యకర్తలకి తోడుగా ఉ.సా, సాంస్కృతిక బృందం అప్పుడే కొండమొదలులో కొద్ది రోజులున్నారు. ఆ కాలంలో ప్రజలలో వెల్లివిరిసిన పోరాట చైతన్యాన్ని, ఆ పోరాటాన్ని నడిపిన నాయకత్వ దృక్పథాన్ని గమనించి ఉ.సా చాలా ఉత్తేజితుడై చాలా పాటలు రాసాడు. అవన్నీ నేటికీ కార్యకర్తలు నిరంతరం పాడుకొంటునే ఉన్నారు.

ఈ విధంగా 74 నుంచీ 86 వరకూ ఉ.సా అంత సృజనాత్మకంగా పాటలు రాయడంలో అతనిని ఉత్తేజపరచి, పురికొల్పింది ఏమంటే మార్క్సిజంను నమ్మి వర్గపోరాట పంథాలో అతన్ని నిలబెట్టిన పార్టీ నిర్మాణమూ, పార్టీ అందించిన కార్యక్రమాన్ని అందుకొని ప్రజలు సాగించిన ఉద్యమాలే. ఇవి రెండూ సృష్టించిన భావావరణం ఉ.సా కలం నుంచి అజరామరమైన గీతాలను సృజింపచేసింది.

1982 తరువాత ఉ.సా నల్గొండ జిల్లాలో మోత్కురు ప్రాంతంలో పార్టీ నాయకుడుగా వెళ్ళాడు. ఆ ప్రాంత పార్టీ సీనియర్ నాయకులైన కామ్రేడ్ కోటయ్య(కొప్పుల మోహనరెడ్డి)స్వస్థలం. ఆయన రాజకీయ, సాంఘిక సంబంధాలూ స్థానిక కార్యకర్తల కృషి, నాయకత్వం సూచించిన ఐక్యకార్యాచరణ పద్ధతులతో ఉ.సా. ఆధ్వర్యాన లోఓల్టేజికి వ్యతిరేకంగా వేలాది మంది రైతాంగం కదిలారు. దీని కొనసాగింపుగా పోచంపాడు వరదకాలువ సమస్యపై రైతాంగాన్ని కదలించారు. ఆ సమయంలో ఎన్నికలు వచ్చాయి. ఉ.సా నిబడ్డాడు. వారు ఆశించినదానికన్నా తక్కువ ఓట్లు వచ్చాయి. ఒక తక్షణ సమస్యపై ఐక్యకార్యాచరణలో వేలమంది కదలడం వేరు, ఒక ప్రజాసంఘం క్రింద ఆ ప్రజలు సంఘటితమై

ఓటు వేయడం వేరు. ఎన్నికలలో పోటీ చేయాలనే అంశంపైనా, ఎన్నిక అనంతరం వచ్చిన ఫలితాలను ఆర్ధం చేసుకోవడంలో నాయకత్వ సూచనలను స్వీకరించలేకపోవడం - క్రమంగా స్వీయాత్మక ధోరణికి గురికావడం జరిగింది.

ఇక్కడ ఒక విషయం స్పష్టం చేసుకోవాలి. గుంటూరు నుండీ గోదావరి జిల్లాలు, నల్గొండ వరకూ, నిర్మాణం లోపలగానీ ప్రజలలో కానీ ఉ.సా ఎక్కడా ఏ రకమైన వివక్షతను ఎదుర్కోలేదు. ప్రతిచోటా నాయకుడుగా అందరి గౌరవాభిమానాలనే పొందాడు. మార్చుకొన్న అతని దృక్పథమే ఉ.సా ను దూరం చేసింది.

ఆ తర్వాతి కాలంలో అతని దృక్పథం, ఆచరణ విప్లవప్రజా ఉద్యమ శక్తులలో అనైక్యతను ప్రోత్సహించడానికి ఉపయోగించబడింది. 1992 నాటి ఏడు విప్లవ నిర్మాణాల ఐక్యతను "ఎదురీత" పత్రిక స్వాగతించలేదు. పైగా ఆ ఐక్యత స్థానంలో మరో "పోలరైజేషన్"ను కోరుకొంది. అంటే మరిన్ని చీలికలే. జరిగింది కూడా ఇదే. అంతిమంగా సమాజ పురోగమనానికి 1986 తరువాత ఉ.సా స్వీకరించిన భావాలు దారితీయవు. వర్గపోరాట దృక్పథాన్ని "ఆర్ధిక నియతివాదమనీ, వర్గకుదింపు వాదమనీ" పేర్కొనే తదితర అస్థిత్వవాద భావాలన్నీ ఆయన రచనల రూపంలో ఉన్నాయి. పార్టి లోపల ఉ.సా. ఐలయ్య భావాలపై ఉ.సా. సమక్షంలోనే ఆయన వ్రాత పూర్వక అభిప్రాయాలపై 3 రోజులపాటు సమగ్రమైన చర్చ సాగింది. ఉ.సా అభిప్రాయాలను తిరస్కరిస్తూ వాటికీ మార్క్సిజానికి సంబంధం లేదని ప్రకటించి పార్టీ నిలబడింది. నిర్మాణం లోపల విషయాలు పైవిధంగా ముగిసాక పార్టీ బయట మాపై తప్పుడు ముద్రలతో దుష్ప్రచారం సాగిస్తూ వచ్చిన సాహిత్యాన్ని నాడే ఖండిస్తూ బుక్లెట్ను ప్రచురించాము.

పీడితులకు నిజమైన విముక్తి, వికాసం ఈ వ్యవస్థ మార్పుతో ముడిపడి ఉందనీ, అన్ని ఉద్యమ, రాజకీయ కార్యకలాపాలు ఈ లక్ష్యంతో సాగాలనే మా ధోరణికీ ఈ వ్యవస్థ లోపలే పీడితుల పురోగమనం, వికాసం సాధ్యమేననీ, అందుకు తగ్గ సర్దుబాట్లు, తగాదాలు, పొందికలు ఉండాలనే ధోరణికి మధ్య ఉన్న మౌలికమైన తేడా ఇక్కడ ముఖ్య అంశం. ఉ.సా. మిత్రబృందం వారు ముందు ప్రజారాజ్యం పార్టీలోనూ, తర్వాత కాంగ్రేసుపార్టీలో విలీనం కావడం ఆశ్చర్యకర మైనదికాదు. సబ్ఆల్టర్న్ సిద్ధాంత ధోరణులని చెప్పబడుతూ మనదేశంలో వ్యక్తం ఆయిన ఇలాంటి ధోరణులతో మా నిర్మాణం ఆంతరంగికంగా 1990ల నాటికే తలపడింది, ఓడించింది. అప్పటినుండీ మాపై అగ్రకుల ముద్ర వేయటం ద్వారా పీడితులలో మా స్థానం లేకుండా చేయాలని ఎందరు ప్రయత్నించినా అవి విఫలయత్నాలే అయ్యాయి. అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ నుండీ శ్రీకాకుళం జిల్లా లక్షింపేట వరకూ అణగారిన దళిత ప్రజల పోరాట శ్వాసలో మా ఊపిర్లు వున్నాయి. లక్షింపేట సంఘీభావ ఆందోళనలో అమరులు తారకంగారి నేతృత్వంలో మేము భాగస్వాములం. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాలలో మేమూ, ఉ.సా కలిసే పాల్గొన్నాము. 2017 డిసెంబర్లో కామ్రేడ్ కోటయ్యగారి అంతిమయాత్రలో ఉ.సా పాల్గొన్నాడు. అంతకుముందు 2015లో పద్మ మరణించిన సమయంలో దూరప్రాంతంలో ఉండటం వల్ల ఫోనులోనే అయినా ఉ.సాను పలుకరించి సంతాపం తెలిపాము.

ఉ.సా మరణాన్ని కుడా మా పై దాడికి కొందరు వాడుకొంటున్నారు. పీడిత ప్రజా ఉద్యమాలకు ఉ.సా చేసిన అసలైన కృషిని విస్మరిస్తున్నారు. మాతో ఉన్న కాలంలో పీడిత ప్రజానీకాన్ని చైతన్యపరచేందుకు ఉ.సా సాగించిన కృషిని మేము సొంతం చేసుకొంటున్నాము. అతను మాతో విభేదించిన విషయాలు కాగితాల మీద ఉన్నాయి. ఆ భావాలూ, వాటి ఆచరణ తేటతెల్లమవుతున్న స్థితిలో అర్థాంతరంగా ఉ.సా మరణించడం నిజంగా విచారకరం. మోత్కూరు ఎన్నికలూ, మోతుకూరు ఉద్యమంతో ఆయన విప్లవ కమ్యూనిస్టుగా సాగిన 11 సంవత్సరాల ప్రస్థానానికి ముగింపు పలికి "ఎదురీత" పేరుతో కమ్యూనిస్టు వర్గ ఉద్యమాలపై ఎదురుదాడికి దిగి, వర్గసంకరం పొందడం అతని పాలిట విషాదమే.

ఉ.సాంబశివరావు మృతికి మా ప్రగాఢ సంతాపాన్ని తెలియచేస్తున్నాము.

**ఎస్. ఝాన్సీ,**

**29/7/2020**

**సి.పి.ఐ.(ఎం-ఎల్)**

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ**

ooo